


# బాల సాహిత్యం - నా అనుభవాలు - సూచనలు

ప్రపంచ తెలుగు మహాసభల్లో బాల సాహిత్యానికి ఒక రోజు, బాలలకు మరో రోజు ప్రత్యేకంగా కేటాయించడం ఒక కొత్త దిశకు నాంది అని చెప్పవచ్చు. ఆ ఉత్సాహమే మళ్లీ ఈ బాలచెలిమి. పిల్లల సినిమా, అంతర్జాతీయ చలన చిత్రోత్సవం మొదలుకొని తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రిసోర్స్ సెంటర్ ద్వారా ప్రతి శనివారం ఒక సమావేశం చొప్పున చర్చా కార్యక్రమాలు నిర్వహించిన ఎం.వేదకుమార్ ఈ పత్రికకు సంపాదకుడు కావడం శుభ సూచకం. ఆగిపోయిన బాలచెలిమి మళ్లీ వస్తోందన్న సంతోషం. బాల చెలిమి, బాల చెలిమి ముచ్చట్లు, సదస్సులు, చర్చలు మళ్లీ తెలుగునాట అందులోనూ హైదరాబాద్‌లో తిరిగి ప్రారంభం కావడం బాల మిత్రులకు ఆనందం కలిగించే విషయమే.

గతంలో చందమామతో పాటు ఎన్నో పత్రికలు వచ్చాయి, పోయాయి.. ఈ నేపథ్యంలో బాల చెలిమి గురించి ప్రత్యేకించి మాట్లాడటానికి ప్రతి నెల రెండోవారం నిర్వహించే బాల చెలిమి ముచ్చట్లులో భాగంగా " బాల సాహిత్యం - నా అనుభవాలు - సూచనలు" అనే అంశంపై బాలచెలిమి పిల్లల వికాస పత్రిక, చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్లో "బాలచెలిమి ముచ్చట్లు" 9 వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ప్రముఖ రచయిత డాక్టర్ నాళేశ్వరం శంకరం, ఘనపురం దేవేందర్, స్ఫూర్తి డైరెక్టర్ పద్మిని రంగరాజన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ ఎం.వేదకుమార్, ప్రతినిధులు రఘు, శ్రీనివాస్, వేలాద్రి, రాజ్‌కుమార్, జ్యోతి, రజిత, వాసవి, షేక్ మొసిన్. కె.ప్రభాకర్, కో-ఆర్డినేటర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

**ఎం.వేదకుమార్ - చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ :**

బాల సాహిత్యం గురించి పిల్లలకు ఎలా తెలపాలి..? ఈ బాలలకు ప్రపంచాన్ని ఎలా చూపించాలి...? పిల్లల మనస్సులోని మాటలను బయటకు ఎలా తెలియజేయాలి...? పిల్లలకు గతంలో వచ్చిన కథల పుస్తకాలు కావచ్చు, పిల్లల సినిమాలు కావచ్చు, బాలల సాహిత్యాలు కావచ్చు... ఇట్లా అన్నింటినీ పరిశీలిస్తూ... పిల్లల కోసం ఈ బాల చెలిమిని తీసుకొని రావడం జరిగింది. అనేక మంది ఉపాధ్యాయులు, రచయితలు, కవులు, విశ్లేషకులు, అనుభవ వ్యక్తులను ఒకచోట ఏర్పాటు చేసుకుని పిల్లల కోసం ఈ వేదికను ఏర్పాటు చేయడం జరుగుతోంది... పెద్దవాళ్ల అనుభవాలు, సూచనలు, సలహాలను తెలుసుకుంటూ.. వాళ్ల బాల్యంలో నిర్వహించిన ఆటపాటలు, కథలు, రచనలను పిల్లలకు తెలియజేయడం ఈ తొమ్మిదవ బాల చెలిమి ముచ్చట్లు నేపథ్యంలో "బాల సాహిత్యం - నా అనుభవాలు - సూచనలు" నిర్వహించడం సంతోషం..

గ్రామాల్లో ఉన్న పిల్లలకు చదువు రాకున్నా వాళ్లకు కోళ్లలాటలు, కబడ్డీలు, బొమ్మలాటాలు ఇట్లాంటివి వాళ్ల తాతల నుంచి నేర్చుకొనేవారు.. అట్లాగే చదువుకున్న పిల్లలు కూడా ఒక వంద పేజీల కథలు కూడా వాళ్లు చూడకుండా చెప్పగలరు.. ఇలాంటి పిల్లలు మన రాష్ట్రాలలో దేశాలలో ఉన్నారు.. అయితే ఇంకా రాబోయే తరాల పిల్లలకు ఎట్లా చేర్చపడాలి అనే ఆలోచనతో ఈ బాల చెలిమి ముచ్చట్లును నిర్వహించడం జరుగుతోంది.

**అల్లం నారాయణ - తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మన్ :**

పిల్లల కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం, పిల్లల కోసం బాల చెలిమి, బాలల కోసం ఇలాంటి ముచ్చట్లు చెప్పుకోవడం ఒక మంచి పనిగా భావిస్తున్నాను. నిజానికి విప్లవాత్మకంగా గడిచిన మాకు పిల్లలతో ఎట్లా సంభాషించాలో తెలియదు. ఉపాధ్యాయులు అయితే తప్ప లేక టీచర్లు అయితే తప్ప మాలాంటి వాళ్లకు తెలియదు.. ప్రతి మనిషి జీవితంలో బాల్యంలో పడ్డ ప్రభావాలు, చిన్నప్పుడు చదివిన చదువులు వాటి ప్రభావం మామూలు కాదు.. నిజానికి మా కుటుంబంలో ముగ్గురం రచయితలుగా ఉన్నాం.. మా పెద్దన్న అల్లం రాజయ్య మంచి కథకుడు. మా చిన్నన్న మంచి పాటగాడు, కవి. నేను కూడా కవిత్వం రాశాను, జర్నలిస్టుగా ఉన్నాను. వీటన్నింటికి మాకు మూల కారణం మేము చదివిన మంథనిలో ఒక లైబ్రరీ ఉండేది. మేము ఒక ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లేవాళ్లం. కాబట్టి ప్రతిరోజు లైబ్రరీ కోసం అయినా రోజు వెళ్ళేవాళ్లం. ఇప్పటికీ మాకు గుర్తు భాష మీద కానీ, చదువు మీద కానీ, సాహిత్యం మీద కానీ చివరకు జీవితం మీద కానీ ఆ లైబ్రరీలో చదివిన పుస్తకాలు వల్ల ఏర్పడిన ఆసక్తే ముగ్గురిని ఇంతదూరం తీసుకొచ్చింది.

ఇది చెప్పితే గంభీరంగా ఉంటుంది కానీ, చందమామ అనే